

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-189-

(6 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"స్త్రీ ఎప్పుడూ చక్కగా అలంకరించుకుని, అందాల రాసిగా ప్రత్యక్షమవుతూ వుండాలి భర్తముందు. సర్వకాల సర్వావస్థల్లో ఆ సౌందర్యాన్ని అలా వ్యక్తపరుస్తూనేవుండాలి. ఒకప్పుడు 'అప్సరసగా' ఒకప్పుడు 'అప్పలమ్మ'గా అవతరించి భర్తను చికాకు పరచరాదు" –

పెళ్ళి సందర్భంగా ఆడపిల్లకు అందించిన సలహాలో ఇది ఒకటి. ఎప్పుడూ అలా అలంకరించుకుని వుండమని స్త్రీలకు బోధించనక్కరలేదు. అలా వుండాలనేదే వారి ఆశయం – అభిలాషా! అయితే ఎంతమందికీ అవకాశాలున్నాయి – అనేది విచారణీయాంశం.

యోగ్యులైన భర్తలు కొందరు తమ జీతంలో భార్య దుస్తుల పద్దు 'ఫస్ట్ చార్జీ'గా భావించి, ఆ మొత్తం ముందే తీసి అందించడం నేనెరుగున్నాను. అవతల బాకీలు తీరక అవస్థపడుతున్నా సరే, ఆమె వన్నెల విసినకర్రగా, రంగుల రామచిలుకగా, రంభ పినతల్లి కూతురుగా, రాజనర్తకిగా ఇంట్లో తిరుగుతుంటే చాలు అప్పులవాళ్ళు వాకిట్లో ఎన్ని పిచ్చి కేకలు పెడితేనేం. కొన్నాళ్ళు అడిగిన తర్వాత ఎన్ని బండకూతలు కూస్తేనేం?

"నా సౌందర్యరాసి తర్వాతనే సర్వసృష్టి" అన్నంత మోజుతో వుంటారా ప్రాణనాదులు అలాటివారికి ఊరంతా బడా దాతలే. అయితేనేం ప్రేయసి కనీనికల్లోనుంచి వెల్లివిరిసే వెన్నెల దారాలలో ఆయన మనస్సు ఉయ్యాలలూగుతూ మైమరచిపోతుంది. అప్పుల మాట మరిచిపోవడం ఒక లెక్కా?

రేడియోలో ఈ 'మాసపు పాట' అన్నట్లు అలాటి అతివలకు 'ఈ మాసపు చీర' అంటూ ఒకటి వుండి తీరవలసిందే.

ఖరీదు మాట ఆవిడకెందుకు? అవతల భర్త వున్నాడు 'భరించేవారు భర్త' అనే నిర్వచనం వుంది. ఆమెలో వలపులు ఒలకబోసే నేర్పుండి, ఆయనకు పిచ్చి కులుకులు కులికే నైజం వుంది ఆ అనురాగానికి– పోనీ అనుబంధానికి ఇంకా అడ్డం వుంటుంది.

మేము ఎరుగున్న ఉద్యోగస్థుడి భార్య వుంది భర్త పైన చెప్పిన జాబితాలో వాడు ఆయన అపేక్షకు అంతులేదు. 'క్లాత్ ఎంపోరియం' అంతా బిల్ మక్తాగా మాట్లాడి, ఇంటికి తెచ్చి భార్యకు అప్పగించి ఆవిడ ఉప్పొంగిపోతుంటే తను కుప్పిగంతులు వెయ్యాలన్నంత ఉబలాటం వుంది.

అంత విశాల హృదయం గలవాడు నెలకో రెండు చీరలు కొనడానికి ఎంత మాత్రం సందేహించడు పైగా తన 'స్వల్పసేవను' తలచి లోలోపల ఎంతో చింతిస్తాడు. ఇక ఆవిడ చీరల భోగానికేం లోటు?

దానికి తోడు పుట్టింటివారు కూడా లక్ష్మిని పెట్టెలో బిగించిన ప్రతిభావంతులు. అందుకని సంవత్సరానికోసారి పైకి వచ్చిన నోట్లు పట్టెడు తీసి ఆమె చేతిలో పెట్టి "నీ యిష్టమొచ్చిన చీరలూ అవీ కొనుక్కో అమ్మ" అంటారుట.

అక్కడ నుంచి వస్తూనే ఆమె మారు బేరగాళ్ళను మించినంత మూటలు వేసుకుని వస్తుంది. వచ్చిన రెండు మూడు రోజులవరకూ, చుట్టుపట్ల వాళ్ళకు, స్నేహితులకూ "వస్త్ర ప్రదర్శన" జరుగుతుంది. అందరూ ఆమెను ప్రస్తుతించి వెడుతూ వుంటారు.

ఒకసారి ఆమె అన్నదట "పగటిపూట మాత్రం గంటకో చీర చొప్పున కడితే, ఆరురోజుల ఎనిమిది గంటలవరకూ నాకున్న చీరలు సరిపోతాయి" అని. ఇది నేను విని రెండు నెలలయింది. ఈనాటికి వారానికి సరిపడ్డవి సమకూర్చుకుని వుంటుంది.

ఈ రకం ఇలా వుంటే డబ్బుండి పెళ్ళానికి చీర కొనడమంటే బాధపడే వాళ్ళు, బావురు కప్పలాగా అరిచేవాళ్ళు ఇంట్లో వుండే వల్కలాజీనాలు ధరించమనేవారూ కొందరుంటారు. "ఎప్పుడూ చీర గొడవేనా? వేరే ఖర్చులు లేవా నాకు. శాలరీ అంతా శారీలకే సరిపెట్టనా? ఏదో ఒకటి కట్టుకుని కాలక్షేపం చెయ్యి. పండంటి మనిషివి పాతవి కట్టుకున్నా బానే వుంటావు." అని ఒకవిధమైన ఆత్మసన్యాసాన్ని ప్రోత్సహించే పురుష పుంగవులు అనేకమంది వున్నారు. భార్యల అలంకారాన్ని గురించి ఇలాటివారికి ఎలాటి చింతా వుండదు. ఆత్మ సాక్షాత్కారం కోసం ప్రాకులాడే పరమ వేదాంతుల జాబితాలో వారు వీరందరూ.

మూడు బాంకుల్లో ఎక్కౌంటు వుండి కొంచెమో గొప్పో ఇనప్పెట్టెలో మూలుగుతూ వుండి గోళ్ళూడకొట్టి గవర్నమెంటు దగ్గరనుంచి ఒక పెద్ద మొత్తం పట్టుకొస్తున్నా ఒక ఉద్యోగి భార్య ఎప్పుడు చూసినా మూసవాయనం ముత్తైదు చీరనే ధరిస్తుంది. ఆవిడకున్న నాలుగు పాత చీరల్లో ఒకటి వుతికినా వెలవని చీర వుందిట. కళకళలాడుతున్న ఆ చీర రంగులోగల నిజాయితీని వర్ణిస్తూ సంబరాలు పడుతుందావిడ పాపం. అంతేగాని క్రొత్తవి బజారులో వున్నాయనే మాటే మరిచిపోతుంది. అసలు చీరల ఉత్పత్తి దేశంలో నిషేధించారనే భావం కల్పించుకుందేమో తెలియదు ఆ భర్త ధృఢ సంకల్పాన్ని అవగతం చేసుకుని.

ఆ నాలుగు చీరలూ అయినా పుట్టింటివారు పెట్టినవేనట. అందులో ఏదైనా ఒకటి చిరగడం చూస్తే భర్తగారంటారట "అది చిరిగిపోతుంటే చూస్తూ వూరుకున్నావే? కళ్ళు లేవా? ఒళ్ళు తెలియడం లేదా? వెంటనే పుట్టింటికి ఓ కార్డు ముక్క వ్రాసి పడెయ్యకూడదూ వచ్చే పండక్కి పంపేది కొంచెం ముందే పంపమని. అయినా ఇలాటి చవకబారు చీరలు పంపించుకుంటారేం? మొక్కుబడి తీర్చుకుందామనా? మన్నిక గలవి పంపమని వ్రాయి. దీంతో వాళ్ళేం దివాలా తియ్యరు. ఆడపిల్లను మోసం చెయ్యడమా? వాళ్ళకు జయం కాదు" అని నీతి సూత్రాలు ఏకరువు పెడతాడట ఆ హృదయేశ్వరుడు.

అన్న వస్త్రాలు– అనే వాటిలో ఆయనగారు వస్త్రాల విషయంలో అస్త్ర సన్యాసం చేసి కొంత విశ్రాంతి కల్పించుకున్నాడు.

ఇలాంటి వారు కొందరుండటం వల్ల స్త్రీ ఇంట్లో అప్సరసగా సాక్షాత్కరించడానికి బదులు 'అప్పలమ్మగా' అవతరించడమే జరుగుతూ వుంటుంది. ఇది అన్నీ వున్న అప్పలమ్మతనం. మొదట చెప్పిన రకం "ఐశ్వర్యం మాట ఆలోచించని అప్సరస రూపం"

పెళ్ళిళ్ళ సందర్భంలో అందించే సందేశాలకూ, ఆశీర్వాదాలకూ అంతు వుండవు. కాని అవి నెరవేడం మాట ఎంతవరకు సత్యం? ముఖ్యంగా భర్తకు భార్య ఆహారం మీద ఆంతులేని అభిమానం వుంటే తప్ప అది నెరవేరదు. అది వారి వారి జాతకాలను బట్టి వుంటుంది.

వస్త్రాల విషయంలో కూడా అంతులేని దారిద్ర్యం అనుభవించే వారెంతమందో వున్నారు. వారి ఇక్కట్లు ఆ ముక్కంటికే ఎరుక.

Post your comments